పెరుగుతున్న రాజకీయ జోక్యం!

కేఎంసీపై ప్రజాప్రతినిధుల, నాయకుల పెత్తనం

- కార్యాలయ పరిపాలనపై ఎఫెక్ట్
- నిర్ణయాలను మార్చుకునేలా ఒత్తిళ్లు
- తలలు పట్టుకుంటున్న ఉన్నతాధికారులు



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ పరిపాలన అస్తవ్యస్తంగా మారుతోంది. అధికారులు తీసుకునే నిర్ణయాల్లో రాజకీయ జోక్యం అధికమవడంతో ఏ నిర్ణయమైనా స్వేచ్ఛగా తీసుకునే పరిస్థితులు ఉండటం లేదు. చివరి ఫలితం వచ్చే సరికి అటు పరిపాలనపై, ఇటు అధికారులపై ప్రభావం చూపుతోంది. ప్రతీ నిర్ణయాన్ని నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రభావితం చేసేందుకు చూడటంతో అధికారుల్లో అసహనం, ఆందోళన వ్యక్తమవుతోంది. విపరీతమైన ఈ జోక్యాన్ని నివారిస్తేనే తాము సక్రమంగా పనిచేయగలమనే ఆలోచనలో ఉన్నతాధికారులున్నట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో కేఎంసీలో ఈ తరహా పెత్తనం అధికమైందనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

ఆధిపత్యం..

కేఎంసీలో ప్రజాప్రతినిధుల మధ్య ఆధిపత్యం పెరిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల అధికారులు కార్యాలయ పరిపాలనపై తీసుకుంటున్న నిర్ణయాల్లో ఒకరిద్దరు జోక్యం చేసుకొని వాటికి అడ్డుపడుతున్నారనే చర్చ జరుగుతోంది. అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, స్థానిక సమస్యలపై మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు కార్యాలయ పాలనలో జోక్యం చేసుకోవడంపై అధికారులు పెదవి విరుస్తున్నారు. ఒక పక్క నగరంలో పారిశుద్ధ్యం మెరుగు పర్చడం, ఆక్రమణ తొలగింపుపై మంత్రి తుమ్మల, కలెక్టర్ అధికారులను ఉరుకులు పెట్టిస్తుంటే.. మరో పక్క కార్యాలయంలో పాలన చక్కదిద్దుకుంటున్న అధికారులపై ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ఒత్తిళ్లు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.

నిర్ణయాలపై ప్రభావం..

కేఎంసీ కార్యాలయంలో పనులు చేయకుండా కాలం గడిపే సిబ్బంది, అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే వారిని విభాగాలు మార్చేందుకు ఉన్నతాధికారులు చర్యలకు పూనుకుంటున్నారు. ఇటీవల ఈ చర్యలకు ఉపక్రమించిన అధికారులకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నుంచి వింత అనుభవాలు ఎదురవుతున్నాయన్న చర్చ జరుగుతుంది. అవినీతి, అక్రమాలు జరుగుతున్న విభాగాల్లోని సిబ్బందిని మార్చే ప్రయత్నం చేయగా వారిని మార్చొద్దంటూ అధికారులకు ఇటీవల వచ్చిన పైరవీలతో తలలు పట్టుకుంటున్నారు. ఒత్తిళ్లు పెరగడంతో కార్యాలయ పాలనను గాడిన పెట్టేందుకు అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రభావం పడుతున్నట్లు తెలుస్తోంది.

రాజకీయ అండతో..

కార్యాలయంలో అవసరానికి మించి సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు మొదటి నుండి ఉన్నాయి. శానిటేషన్ విభాగంలో విధుల్లోకి చేరిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రాజకీయ అండతో పైరవీలు చేయించుకొని తమ విధులను కార్యాలయాల్లోకి మార్చుకున్నారు. అటు అధికారులను ప్రసన్నం చేసుకోవడం, ఇటు రాజకీయ నాయకుల అండతో పలు విభాగాల్లో పాతుకపోయారు. వీరి పనితీరుపై ప్రస్తుతం వస్తున్న ఆరోపణలతో అధికారులు వీరికి చెక్ పెట్టే ప్రయత్నం చేస్తుంటే మళ్లీ అధికారులపై ఒత్తిళ్లు తీసుకోస్తున్నట్లు చర్చ జరుగుతుంది. ప్రభుత్వం మారిన తర్వాత పనులు చేయకుండా ఖాళీగా తిరుగుతున్న సిబ్బందిపై, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటారని అంతా చర్చించుకున్నా.. ప్రస్తుతం కేఎంసీలో జరుగుతున్న తీరు చూసిన వారంతా మిన్నకుంటున్నారు.

పార్కుల్లో సౌకర్యాలు కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: పార్కుల్లో సౌకర్యాలు కల్పించాలని అధికారులను మేయర్ నీరజ ఆదేశించారు. నగరంలోని త్రీటౌన్ ప్రాంతం వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఉన్న గెల్లా కేశవరావు పార్కును మేయర్ నీరజ సోమవారం సందర్శించారు. పార్కులో వాకింగ్‌ట్రాక్‌ల మట్టితో నింపాలని, చుట్టూ ప్రహరీ ఎత్తు పెంచాలని స్థానిక మహిళలు కోరారు. అంతక ముందు బోసుబొమ్మ సెంటర్‌లో ఉన్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలించగా ట్యాంక్‌కు ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని హమాలీలు కోరగా పరిష్కరించాలని మేయర్ కేఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, ఈఈ కృష్ణాలాల్, డీఈఈ మాధవి, నాయకులు యర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మినహాయింపు లేకుండా రుణమాఫీ చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: రైతు రుణమాఫీ ఎలాంటి మినహాయింపు లేకుండా బ్యాంకులో అప్పు ఉన్న రైతులు అందరికీ పూర్తి చేయాలని, రైతుభరోసా తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాల్గొవ విడత విడుదల చేసిన రుణమాఫీ డబ్బు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయలేదన్నారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రం ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేస్తూ మంగళ, బుధ, గురువారం జిల్లాలో అన్ని గ్రామాల్లో ప్రతులను దహనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాతా భాస్కరరావు, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్‌కె.మీరా, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, గోడవర్తి నాగేశ్వరరావు, బిక్కసాని గంగాధర్, శీలం సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను కాలయాపన లేకుండా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాల్సిన ఆరుగ్యారంటీలు అమల్లో పేదలకు గృహ నిర్మాణ పథకం వితంతువులు, వృద్ధులు దివ్యాంగులు పెన్షన్లు పెంపుదల ఊసే లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ.జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, షేక్ మీరాసాహెబ్, పార్టీ మండల కార్యదర్శులు భుక్యా శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, షేక్.నాగులుమీరా, బత్తిని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక



అభినందిస్తున్న తహసీల్దార్

నేలకొండపల్లి: సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు మండలం నుంచి నలుగురు ఎంపికయ్యారు. ఈ నెల 30న మహబూబునగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో మండలంలోని ప్రవీణ్(చెరువుమాధారం), అజయ్, నవీన్ (కొత్తకొత్తూరు), వినోద్(నేలకొండపల్లి) యువకులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సోమవారం అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, ఎంఈఓ బీ.చలపతిరావు, సీపీఐ మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్, పీడీలు రామకృష్ణ, కె.అన్నపూర్ణ, ఉజ్వల, రమాదేవి, పీఈటీలు ఎస్.ప్రశాంత్, గోపి పాల్గొన్నారు.

ఈటలకు సన్మానం



రాజేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర మాజీ మంత్రి, ఎంపీ ఈటల రాజేందర్‌ను బీజేపీ నాయకులు సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం జిల్లాలోని రాజకీయ పరిస్థితిని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సన్నె ఉదయ్‌ప్రతాప్, డాక్టర్ శీలం పాపారావు, కొప్పెర వెంకటనర్సయ్య, జిల్లా కార్యదర్శి నకిరికంటి వీరభద్రం పాల్గొన్నారు.

మెడికల్ దోపిడీని అరికట్టాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో మెడికల్ దోపిడీని అరికట్టాలని, మెడికల్ దందాపై చర్యలు తీసుకోవాలని పీవైఎల్, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శులు ఎన్‌వీ.రాకేష్, ఆవుల మంగతాయి అన్నారు. ఈ మేరకు సోమవారం ఖమ్మంలో మెడికల్ షాపుల్లో సర్వే నిర్వహించారు. నాయకులు ప్రతాపనేని శోభ, టి.ఝాన్సీ, తోటా రమేష్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ఆహ్వానం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ముస్తఫానగర్ సెయింట్ మేరీ స్కూల్ సువార్త క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు హాజరుకావాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి సోమవారం ఆహ్వానం అందించారు. సువార్త క్రైస్తవ సంఘం కమిటీ సభ్యులు సత్యం పాస్టర్, విజయమ్మ, నరసింహారావు, దేవేందర్, రవీందర్‌రెడ్డి, లింగస్వామి ఉమేష్, శ్రీను, రాము, సాంగ్య, సుజాత, మమత ఉన్నారు.

దుస్తులు పంపిణీ

తిరుమలాయపాలెం: క్రిస్మస్ సందర్భంగా లండన్‌లో ఉంటున్న తన స్నేహితుడు జాన్‌కోప్ అందించిన దుస్తులను సోమవారం మండలంలోని ఎదుల్లచెరువు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు కమతం రాము పంపిణీ చేశారు. హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి: బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షా పై చర్యలు తీసుకోవాల్సిందేనని కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అమిత్‌ షా వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం జిల్లా కేంద్రంలో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన వేణు, మండల అధ్యక్షుడు యడవల్లి నాగరాజు, సోమనబోయిన సాయిన వీన్, కడియాల నరేష్ పాల్గొన్నారు.

సీపీఐ సభ్యత్వ నమోదు

ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఐ శతవసంతాల నేపథ్యంలో ఈ నెల 26న ఖమ్మంలో జరిగే భారీ ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నాయకులు జ్వాల నరసింహరావు కోరారు. సోమవారం నగరంలో పార్టీ సభ్యత్వాలు నమోదు చేసి అందజేశారు. శ్రీను, సాయికృష్ణ, అనసూర్య పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్రీయ బాలస్వస్తియ కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. వైద్యులు రవి, రెహానాసుల్తానా, పీహెచ్‌సీ డాక్టర్ మహేందర్‌రెడ్డి విద్యార్థులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నారాయణరావు, హెచ్‌ఈఓ రామయ్య, రూప్‌సింగ్, సరోజ, ధనలక్ష్మి, ఆశవర్కర్లు సుజాత, ధనలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీఓ రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని కొత్తలింగాల, గోవింద్రాల, బర్లగూడెం, పాన్నేకల్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఇళ్ల సర్వేలో తప్పులు లేకుండా చూసుకోవాలని, సర్వేను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందించాలి

ఖమ్మంమయూరిసెంటర్: భూమిలేని, నిరుపేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తానన్న రూ.12 వేల ఆర్థికసాయాన్ని ఒకే దఫా అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సమావేశం సోమవారం జిల్లా అధ్యక్షుడు పగిడిపల్లి ఏసు అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు పగిళ్ల వీరభద్రం, వీరబాబు, చీనా, రామలక్ష్మి పాల్గొన్నారు.

అనఘాష్టమి వ్రతం



వ్రత పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని 45వ డివిజన్ మామిళ్లగూడెంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణమండపంలో మార్గశిర బహుళ అష్టమిని పురస్కరించుకుని సోమవారం శ్రీ దత్తాత్రేయ అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువందనం, గురు పాదుకాపూజ, పాదుకలకు పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, నీరాజన మంత్రపుష్పములు నిర్వహించారు. అనంతరం అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కోనా గోవిందరావు, వజినేపల్లి నరసింహారావు, బిజ్జాల ఈశ్వరరావు, పెరుగు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

జీవాలను బాధ్యతగా కాపాడాలి



మాట్లాడుతున్న పాండు

ఖమ్మంరూరల్: భూమ్మీద ఉన్న ప్రతీ జీవాలను, అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జీవ వైవిధ్య సంస్థ కరస్పాండెంట్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని బారుగూడెంలో జరిగిన జీవవైవిధ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ... నేడు ప్రకృతిని, భూమిపై ఉన్న జీవాలు, వృక్షాలు, ప్రధానంగా అడవుల్లో నివసించే జీవ సంపదను కాపాడుకోలేకపోతున్నామని, ఇది భవిష్యత్ తరాలకు అనర్థమన్నారు. ఈ కార్యక్రమంలో పాండు, ఉపాధ్యాయులు డీవీకే.ప్రసాద్, చిరంజిత, అంగన్‌వాడీ టీచర్ కె.నాగమణి, మౌనిక, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మల్లిడి రమేష్ సహకారంతో సోమవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సీపీఎం నాయకుడు తమ్మినేని కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఎస్.కోటయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శాంతి, వినోద, పార్వతి, శ్రీదేవి, నీలు, రవి, కృష్ణ, సిరికొండ. నాగేశ్వరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ డివిజన్ కమిటీ ఎన్నిక




డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, పృథ్వీ

ఖమ్మం మామిళ్లగూడెం: పీడీఎస్‌యూ ఖమ్మం డివిజన్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా పృథ్వీ, కోశాధికారిగా సాదిక్, ఉపాధ్యక్షులుగా వినయ్, చంద్రశేఖర్, సహాయ కార్యాదర్శులుగా యశ్వంత్, సందీప్‌లతో పాటు 10 మందితో కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యారంగ సమస్యలు పరిష్కారానికి ఉద్యమాలు నిర్మిస్తామన్నారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అధికారులు సోమవారం నగర ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఈఈ కృష్ణాలాల్, ఆర్‌ఓ శ్రీనివాసరావు వినతులను స్వీకరించి పరిష్కారానికి ఆయా విభాగాలకు పంపించారు. ఇక గ్రీవెన్స్ సమయంలో కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ లేకపోవడంతో కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారులు అసహనం వ్యక్తం చేశారు. ఇక వరద బాధితులకు సాయం నగదు అందలేదని మరికొంతమంది బాధితులు ఆందోళన చేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, నాయకులు

కూసుమంచి: ఈ నెల 28 నుంచి 30 తేదీల్లో నల్గొండ పట్టణంలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర విద్యా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మండవ నర్సయ్య కోరారు. సోమవారం సభల ప్రచార పోస్టర్లను కూసుమంచి ఉన్నత పాఠశాలలో ఎంఈఓ రాయల వీరస్వామి ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడుశ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, కార్యదర్శులు బాబురావు, వీరబాబు, సీనియర్ సభ్యులు విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

సుగుణ సేవలు మరవలేనివి

నేలకొండపల్లి: వాసవి క్లబ్ సీనియర్ ప్రతినిధి, ఆర్యవైశ్య సంఘం నాయకురాలు మాటూరి సుగుణ సేవలు మరవలేనివని డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలకేంద్రంలో సుగుణ దశదిన కార్యక్రమం వాసవీభవన్‌లో నిర్వహించగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, మరికంటి రేణుబాబు, తెల్లగొర్ల లింగస్వామి, మాదాసు ఆదాం, డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు పేరాల గాంధీ, తాళ్లూరి సత్యనారాయణ, నాయకులు రామారావు, మురళీ, వెంకటేశ్వర్లు, కడియాల నరేష్, నాగేశ్వరరావు, నరసింహారావు, ఉపేందర్, వనం అచ్యుత్‌రావు, ఉపేందర్, కొత్తా రమేష్, హనుమంతరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

సెమీక్రిస్మస్ వేడుకలు పలు పాఠశాలలు, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేకులు కట్ చేసి పంచిపెట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం సహకారనగర్: సర్వజ్ఞ పాఠశాలలో..



త్రివేణి పాఠశాలలో..



ఖమ్మంగాంధీచౌక్: మౌంట్‌ఫోర్ట్ హైస్కూల్‌లో..



రఘునాథపాలెంలో..

30న హుండీ లెక్కింపు

కూసుమంచి: కూసుమంచిలోని శివాలయం హుండీ లెక్కింపును ఈనెల 30న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఉదయం 11 గంటలకు జరిగే హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

బచ్చోడులో సంత ఏర్పాటుచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడులో ప్రతీ బుధవారం సంత(అంగడి) నిర్వహించాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు మండల ప్రజాపరిషత్ కార్యాలయం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. పది గ్రామాలకు సెంటర్‌గా ఉన్న బచ్చోడు గ్రామంలో సంత ఏర్పాటు చెయ్యడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిమ్మిడి హనుమంతరావు, తాటికొండ అనంతచారి, జక్కుల యాదగిరి, సోమనపల్లి వెంకటేశ్వర్లు, రజిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జడ్సన్‌పై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంవన్‌టౌన్: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందినిపై దుష్ప్రచారం చేసిన బక్క జడ్సన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జర్రిపోతుల అంజనికుమార్, నాయకులు డిమాండ్ చేశారు. డీసీసీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఫేక్ ఐడీలు చేయించారని తప్పుడు ప్రచారాలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బెజ్జం బాలగంగాధర్, ఖమ్మం నియోజకవర్గ అధ్యక్షుడు మహమూద్ నవాజ్, వైరా ఉపాధ్యక్షుడు ఇజ్జగాని సత్యం, నాయకులు కాటబత్తిని రామకష్ణ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రథమస్థానం



బహుమతులతో విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: గురుదక్షిణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో న్యూవిజన్ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ జేవీ. మైఖేల్ తెలిపారు. తమ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎండి.అయాన్, కె.ఉజ్వల్ ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు. విజేతలను చైర్మన్ సీహెచ్. జి.కె.ప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్మశానవాటిక ఏర్పాట్లు నిలిపివేయాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: టేకులపల్లి క్రీడా ప్రాంగణంలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలను నిరసిస్తూ సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్పొరేటర్ సత్యనారాయణ సోమవారం టేకులపల్లి క్రీడా ప్రాంగణం వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు ఉపేందర్, పొదిలి భిక్షం, పొదిలి యాదగిరి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

ఖమ్మం అర్బన్: కొదుమూరు–వందనం ఐడీసీ లిఫ్ట్ స్కీమ్ పనులను ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ గుమ్మడి అనిల్‌కుమార్ సోమవారం సందర్శించారు. అధికారులు బస్వరాజు, సీఈ విద్యాసాగర్, ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వరరావు, ఈఈలు అనన్య, వెంకటరమణ, డీఈలు రమేష్‌రెడ్డి, రత్నకుమారి, మన్మథరావు, మహబూబ్, రాంప్రసాద్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రఘునాథపాలెం: ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: కేజీబీవీ, యూఆర్‌ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ధర్నా నిర్వహించారు. తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంధ్య, పుష్పావతి, సౌజన్య, పావని, సరస్వతి, సామ్రాజ్యం, యేసయ్య, వెంకన్న, రామకష్ణ, ఉపేందర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: సర్వశిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, నాయకులు శంకర్రావు పాల్గొన్నారు.

బతుకమ్మలతో నిరసన



ఖమ్మం సహకారనగర్: బతుకమ్మలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద బతుకమ్మలతో నిరసన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, జిల్లా అధ్యక్షుడు మహబూబ్ పాషా, అనిల్, నిర్మల విజయలక్ష్మీ పాల్గొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ కోరారు.